## క్లుప్తంగా

### ప్రాపర్టీ ట్యాక్స్ రూ.84 కోట్లు వసూలు

- 2 రోజుల్లో ముగియనున్న ఎర్లీబర్డ్ స్కీమ్

**శేరిలింగంపల్లి:** జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా ఆస్తిపన్ను (ప్రాపర్టీ ట్యాక్స్) ఇప్పటివరకు రూ.84 కోట్లు వసూలు అయింది. సర్కిల్ పరిధిలో 48,478 అసెస్‌మెంట్ల ద్వారా ఈ ఆస్తి పన్ను వసూలు చేశారు. ఇంకా మరో రెండు రోజులపాటు ఎర్లీబర్డ్‌లో పన్ను చెల్లించవచ్చని డిప్యూటీ కమిషనర్ వెంకన్న తెలిపారు.

### బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు టౌన్:** బాలుడి వైద్యానికి పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కోమటి గూడెం గ్రామానికి చెందిన ఎల్లంపల్లి శంకర్‌కు సంవత్సరం వయసు గల కుమారుడు గణేష్ ఉన్నాడు. బాలుడికి హైదరాబాద్ నిమ్స్‌లో గుండె ఆపరేషన్ జరిగింది. స్తోమతకు మించి డబ్బు ఖర్చు చేసిన శంకర్ మెరుగైన వైద్యం చేయించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని స్నేహితుల ద్వారా తెలుసుకున్న సీఐ వేణుగోపాల్ రెడ్డి పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిని సందర్శించి బాలుడి కుటుంబ సభ్యులకు రూ. 50వేలు సాయం అందజేశారు.

### నల్లగండ్ల మార్కెట్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ మృతి

**శేరిలింగంపల్లి:** నల్లగండ్ల కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అహ్మద్(55) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతిపై మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

### చైన్ స్నాచింగ్

**గచ్చిబౌలి:** నడుచుకుంటూ వెళుతున్న ఐటీ ఉద్యోగిని మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఐటీ ఉద్యోగిని శ్రావ్య ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో బస్సు దిగి డీఎల్ఎఫ్ సమీపంలోని హాస్టల్‌కు నడుచుకుంటు వెళుతుంది. డీఎల్ఎఫ్ గేట్ నెంబర్-1 ముందు పరుగున వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు 8 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. ఘటనా స్థలాన్ని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ రఘునందన్‌రావు పరిశీలించారు. సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని, త్వరలో కేసును ఛేదిస్తామని గచ్చిబౌలి సీఐ సురేష్ తెలిపారు.

### హెచ్ఐసీసీలో అంతర్జాతీయ హాస్పిటాలిటీ డే

**మాదాపూర్:** మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం రాత్రి అంతర్జాతీయ హాస్పిటాలిటీ డేను ఘనంగా నిర్వహించారు. ఆతిథ్య పరిశ్రమలోని వ్యక్తులు చేసిన సేవలను గుర్తించి మొమెంటోలతో సత్కరించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఆతిథ్య పరిశ్రమ ప్రాముఖ్యతపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఉత్తమ సేవలను అందించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో చెఫ్ ఆరోజ్య బెనర్జీ, చెఫ్ చలపతిరావులతో పాటు ప్రముఖ పరిశ్రమల నాయకులు పాల్గొన్నారు.

### కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. శుక్రవారం సాయంత్రం క్యాంపస్‌లోని ప్రొఫెసర్ గురుబక్ష్‌సింగ్ మైదానంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన హెచ్‌సీయూ ప్రొవీసీ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాలయ ప్రధాన ఉపాధ్యాయురాలు మిత్రవిందారావు, టీజీటీ ఇంగ్లిష్ సరితపునియా ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న హెచ్‌సీయూ ప్రోవీసీ సర్రాజు

# చల్లని చూపు..

- కంటి వెలుగుకు అనూహ్య స్పందన
- 70 వేల మందికి కంటి పరీక్షలు
- యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కీర్తి శైలజ
- కొనసాగుతున్న కేంద్రాలు



**శేరిలింగంపల్లి:** కంటి వెలుగు కార్యక్రమానికి శేరిలింగంపల్లి ప్రాంతంలో మంచి స్పందన వచ్చిందని శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కీర్తి శైలజ పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ పలు అంశాలను వివరించారు. కళ్లు ఎంతో ముఖ్యమని, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఇప్పటికీ ఈ ప్రాంతంలో ఇప్పటికీ కొనసాగిస్తున్నామన్నారు.

**ప్రశ్న:** శేరిలింగంపల్లిలో ఎన్ని 'కంటి వెలుగు' కేంద్రాలు కొనసాగుతున్నాయి ?

**జ:** శేరిలింగంపల్లి ప్రాంతంలో 8 సెంటర్‌లలో ఇప్పటికీ కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతోంది.

**ప్ర:** ఏఏ ప్రాంతాల్లో కంటి వెలుగు కేంద్రాలు నిర్వహిస్తున్నారు ?

**జ:** శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, కొత్తగూడ కమ్యూనిటీ హాల్, ఖానామెట్ ప్రభుత్వ పాఠశాల, జేపీ నగర్ కమ్యూనిటీ హాల్, వేమన కాలనీ కమ్యూనిటీ హాల్, రాయదుర్గ వార్డు ఆఫీస్, ఖెల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీ సిర్కి ఆఫీస్, హఫీజ్‌పేట్ వార్డు ఆఫీస్‌లలో పరీక్షలు కొనసాగుతున్నాయి.

**ప్ర:** ఇప్పటి వరకు ఎంత మందికి పరీక్షలు చేశారు..?

**జ:** శేరిలింగంపల్లి పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించి కేంద్రాలలో 70 వేల మందికి పరీక్షలు చేయడం జరిగింది.

**ప్ర:** రీడింగ్ గ్లాస్‌లు, కంటి అద్దాలు ఎంతమందికి ఇచ్చారు....?

**జ:** శేరిలింగంపల్లిలో 8182 మందికి రీడింగ్ గ్లాస్‌లు అందించాం. అదే విధంగా దగ్గర, దూరపు చూపు లోపం ఉన్న వారికి ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రిస్కిప్షనల్ అద్దాలు 4357 మందికి అందించాం.

**ప్ర:** ఈ కేంద్రాల ద్వారా ఆపరేషన్లకు ఎంతమందిని గుర్తించారు..?

**జ:** శేరిలింగంపల్లి ప్రాంతంలో కంటిచూపు సమస్యతో ఇబ్బందులు పడుతున్న వారిలో 1108 మందిని గుర్తించి వారికి ఆపరేషన్లు చేసేందుకు సిఫార్సు చేశాం.

**ప్ర:** శేరిలింగంపల్లిలో కొవిడ్ పరీక్షలు చేస్తున్నారా?

**జ:** శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కరోనా పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పరీక్షలకు అంతగా స్పందన లేదు. పాజిటివ్ కేసులు రావడం లేదు. అంతేకాకుండా యూపీహెచ్‌సీలో ప్రికాషనల్ డోస్‌లో భాగంగా కార్బీ వ్యాక్సిన్ వేస్తున్నాం.

## ట్రాఫిక్ ఇబ్బందులపై ..

- వెస్ట్ జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ట్రాఫిక్ పోలీసులు



వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్యతో సమావేశమైన ట్రాఫిక్ పోలీసులు

**గచ్చిబౌలి:** ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలపై శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్యతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చర్చించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో సమావేశమై పలు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ నుంచి యశోద హాస్పిటల్ నుంచి సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే కూకట్‌పల్లి నుంచి వచ్చే ట్రాఫిక్‌కు ఇబ్బందులు తొలుగుతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. లెమన్ ట్రీ హోటల్, సైబర్ గేట్ వే , అవాసా హోటల్ వద్ద ర్యాంపులను తొలగించాలని తెలిపారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్న రోడ్లలో వీధి దీపాలు వెలగకపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అలాగే రోడ్ల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించాలని కోరగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, సీఐలు నర్సింహ,శ్రీనాథ్, సుమన్ పాల్గొన్నారు.

## వర్టికల్స్‌లో సైబరాబాద్‌కు టాప్ ప్లేస్

**పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**



**రాయదుర్గం:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వర్టికల్స్‌లో మొదటి స్థానంలో నిలిచిందని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీసు సిబ్బందికి శుక్రవారం ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కూడా 22 ఫంక్షనల్ వర్టికల్స్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, 17 ఫంక్షనల్ వర్టికల్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. మొదటి స్థానంలో ఉన్నామంటే మరింత బాధ్యతతో పనిచేయాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్‌లో వరుసగా టాప్ ప్లేస్‌లో ఉండేందుకు కృషి చేస్తున్న ఏసీపీ శివభాస్కర్‌ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ డీసీపీ కల్మేశ్వర్ ,ఏసీపీ శివభాస్కర్, రవీందర్, ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వీధులను శుభ్రం చేస్తున్న కేర్ ఆస్పత్రి సిబ్బంది

**గచ్చిబౌలి:** పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ సేథి పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలో కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్లీన్‌నెస్ డ్రైవ్‌లో భాగంగా వీధుల్లో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన దేశం కోసం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం పెంపు సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. నగరాలు శుభ్రంగా ఉండాలని అపేడు అంటువ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కేర్ హాస్పిటల్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్ వరకు సిబ్బంది వాక్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.

## దొరికిన బంగారాన్ని అప్పగించిన యువకుడు

**అభినందించిన డీసీపీ శిల్పవల్లి**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు) :** రోడ్డుపై దొరికిన బంగారాన్ని ఓ యువకుడు పోలీసులకు అప్పజెప్పిన సంఘటన శుక్రవారం రామచంద్రాపురంలో జరిగింది. శుక్రవారం సాయంత్రం మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ఆ వివరాలు వెల్లడించారు. బీరంగూడ సాయికాలనీలో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయిస్వరూప్ వివాహ నిశ్చితార్థం ఏపీలోని కాకినాడలో ఈనెల 26వ తేదీ జరిగింది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి బస్సులో బీరంగూడ చౌరస్తాలో దిగాడు. సుమారు ఇరవై తులాలు బంగారు ఆభరణాలు ఉన్న సూట్‌కేసును రోడ్డుపైనే మరిచిపోయి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో భారతీనగర్ డివిజన్ ఎంఐజీ కాలనీకి చెందిన నరేందర్‌గౌడ్ రోడ్డుపై ఉన్న సూట్‌కేసును గమనించి దానిని తెరిచి చూశాడు. అందులో బంగారు ఆభరణాలు ఉండటంతో వెంటనే 100కు డయల్ చేసి విషయం తెలియజేశాడు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించి బంగారాన్ని పోలీసులకు అప్పగించాడు. సూట్‌కేసు పోయిందని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోయిన బంగారం దొరకడంతో సాయిస్వరూప్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. బంగారం ఉన్న సూట్‌కేసును పోలీసులకు అందించిన నరేందర్‌గౌడ్‌ను డీసీపీ శిల్పవల్లి శాలువా కప్పి అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీ నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ సంజయ్, డీఐ ప్రతాప్ లింగం ,ఎస్ఐ శశికాంత్ రెడ్డి ఉన్నారు.

**బాంబు అనుకుని భయపడ్డారు: నరేందర్ గౌడ్**

బీరంగూడ చౌరస్తాలోని జాతీయరహదారిపై సూట్‌కేస్ ఉండటంతో అక్కడ ఉన్న వారు అందులో బాంబు ఉందంటూ భయపడ్డారు. నేను ధైర్యంగా ముందుకు వెళ్లి సూట్‌కేస్‌ను తెరిచి చూడగా బంగారు ఆభరణాలు ఉన్నాయి.

## టీకాపై మరింత అవగాహన అవసరం

**హెచ్‌సీయూ ప్రొఫెసర్, ప్రముఖ ఇమ్యునాలజిస్ట్ శర్మిష్ట బెనర్జీ**

**రాయదుర్గం:** టీకా ప్రాముఖ్యత అందరికీ తెలుసని కానీ దీనిపై మరింత అవగాహన కల్పించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ ఇమ్యునాలజిస్ట్ శర్మిష్ట బెనర్జీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రోగనిరోధక శాస్త్ర దినోత్సవాన్ని ఇండియన్ ఇమ్యునాలజీ సొసైటీ, న్యూఢిల్లీ ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్)తో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగనిరోధక వ్యవస్థను పెంచుకోవడానికి తమవంతు కృషి చేయాలని సూచించారు. 'మనూ' ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోగ నిరోధక శక్తి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కార్యక్రమంలో 'మనూ' ప్రొఫెసర్ పర్వీన్ జహాన్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొ.సల్మాన్ అహ్మద్‌ఖాన్, ప్రొఫెసర్ రాజ్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరీఫ్ అహ్మద్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కాలనీలో ముఖాముఖి

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ బాలయ్యలు పాల్గొన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని క్యాంపస్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలను నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో హెచ్‌సీయూలోని ఆప్టోమెట్రీ అండ్ విజన్ సైన్సెస్ విభాగం స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో కంటి స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. క్యాంపస్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ప్రొ.ఎస్‌వీఎస్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ మురళి పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లోని ఆప్టోమెట్రీ మాస్టర్స్ విద్యార్థులు డాక్టర్ కొండా నాగరాజు, బిందు రెడ్డి, మేఘనతో కూడిన 15 మంది విద్యార్థుల బృందం విద్యార్థులకు పరీక్షలు చేశారు.

### పాజిటివ్ నిల్

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏడుగురికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. పది మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేశారు.

## చైన్‌స్నాచర్ రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

**మియాపూర్:** రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడును దొంగిలించిన వ్యక్తిని చందానగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 4 తులాల చైన్, పల్సర్‌బైక్, సెల్‌ఫోన్, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహ్మారెడ్డి, మియాపూర్ ఏసీపీ నర్సింహారావులు కేసు వివరాలు వెల్లడించారు. బీదర్ జిల్లా ఎక్తాపూర్‌కు చెందిన సంగమేశ్వర్ అలియాస్ వర్షిత్ సంగారెడ్డిలోని ప్రశాంత్‌నగర్‌లో ఉంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే చందానగర్ హుడా కాలనీకి చెందిన శ్యామలకుమారి తమ కూతురు ఝాన్సీతో కలిసి ఈ నెల 23వ తేదీన షాపింగ్ తర్వాత ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా సంగమేశ్వర్ బైక్‌పై వచ్చి శ్యామలకుమారి పుస్తెల తాడు లాక్కెళ్లాడు. చందానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చే యగా, దర్యాప్తులో భాగంగా అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో సీఐ క్యాస్ట్రోరెడ్డి, డీఐ పాలవెల్లి ఉన్నారు.

### సమ్మర్ క్యాంపు ప్రారంభం

**మియాపూర్ :** క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్‌లో నిర్వహించే సమ్మర్ క్యాంపు- 2023ను జోనల్ కమిషనర్ శంకరయ్య, ఉప కమిషనర్లు సుదాంష్, వెంకన్న, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలకు ఇష్టమైన వాటిల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చందానగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు



**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర మూలమంత్ర హోమం, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి 108 కేజీల కుంకుమ, పసుపుతో కుంకుమార్చన చేశారు.

## మే డేను విజయవంతం చేయాలి



మే డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** రామచంద్రపురం డివిజన్ పరిధిలో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) ఆధ్వర్యంలో మే 1వ తేదీన మే డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌తో కలిసి మే డే వేడుకల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మే డే రోజున జరిగే భారీ బహిరంగ సభకు కార్మికులు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు వరప్రసాద్ రెడ్డి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు వెంకటరావు, మాధవరావు, భాస్కర్‌రెడ్డి, అర్జున్, సతీష్, శివ, బాల్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

## కాలనీ కాంటాక్ట్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం



రాఘవేంద్ర కాలనీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** కాలనీ కాంటాక్ట్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, ఈనాడు కాలనీ, సప్తగిరి కాలనీ, వివేకానందనగర్ అపార్టుమెంట్స్, ఏఎస్ రాజునగర్, మెడికల్ సొసైటీ, రామకృష్ణ వీధి కాలనీల్లో నిర్వహించిన కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి పాల్గొన్నారు. కార్యక్రమంలో పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య, నాలా, ఫుట్‌పాత్, పార్కు, వీధి దీపాల సమస్యలు వెల్లువెత్తాయి. త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సీఐ సురేందర్, అధికారులు ఏఈ ఆశా, ఏఎంఓహెచ్ మమత, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, వీధి లైట్లు ఏఈ మృదుల, టీపీఎస్ సోమేష్, వెటర్నరీ డాక్టర్ లింగస్వామి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**సీసీ కెమెరాలు ప్రారంభం**

వివేకానందనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన 220 సీసీ కెమెరాలను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సీఐ సురేందర్, కార్పొరేటర్ మాధవరం రోజాదేవిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, దేవినేని ప్రసాద్, సత్యనారాయణ, నారాయణరెడ్డి, మాజీ కార్పొరేటర్ రంగారావు, నాయకులు పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

**నాలా పూడికతీత పనుల పరిశీలన**

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలోని నాలా పూడికతీత పనులను జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**రాయదుర్గం:** యువ డిజైనర్ల కోసం ఏర్పాటు చేసిన ఇంటీరియర్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జేడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జేడీ డిజైన్ అవార్డు–2023 శుక్రవారం రాత్రి నిర్వహించారు. నేటితరం యువ డిజైనర్లకు కొత్త ఆలోచనలు, కొత్త తరంగాలను అందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్‌షో అలరించింది. మోడల్స్ ర్యాంప్ వాక్ చేశారు.



## దేశ ప్రజల ఆరోగ్య భద్రతకు ఆయుష్మాన్ భారత్



మాట్లాడుతున్న మంత్రి పురుషోత్తం

**కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల**

**పటాన్‌చెరు టౌన్:** దేశ పౌరుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ రూ.5 లక్షల వరకు వర్తింప చేసే హెల్త్ కార్డు ఆయుష్మాన్ భారత్ తెచ్చారని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జనతా ములాఖాత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సొమ్ము వారి ఖాతాల్లో ఒక్క బటన్‌తో నేరుగా జమవుతుందన్నారు. ప్రపంచ దేశాలకు భారత్ అంటే అభిమానం ఉందన్నారు. ఇందుకు నిదర్శం ఉక్రెయిన్‌లో యుద్ధం జరుగుతున్న సమయంలో మన విద్యార్థులు భారత్ జెండాను పట్టుకొని బయటపడ్డారని గుర్తుచేశారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాబూ మోహన్, విజయపాల్ రెడ్డి, రాష్ట్రనేతలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ పాల్గొన్నారు.

## సిటీ నేచర్ చాలెంజ్‌లో హైదరాబాద్

**గచ్చిబౌలి:** సిటీ నేచర్ చాలెంజ్‌లో హైదరాబాద్‌ను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని మాజీ అటవీ ప్రధాన సంరక్షణ అధికారి పి.రఘువీర్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్, పాలపిట్ట పార్కు, నైట్ సఫారీలో మొక్కలు, జంతువులు, పక్షుల ఛాయా చిత్రాలను కెమెరాలలో బంధించారని తెలిపారు. నేచరలిస్ట్ వాలంటీర్స్, బర్డ్ వాకర్స్, గార్డెన్ వాకర్స్, అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు 1600 ఛాయా చిత్రాలను 'ఐ నేచరలిస్ట్'లో అప్‌లోడ్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎం.జె.అక్బర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.స్కైలాబ్, ఎకో టూరిజం మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్ తదితరులు పాల్గొన్నారు.